సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం ၊ 11 ၊ మే ၊ 2024





నారాయణపేట జనసభలో అభివాదం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చిత్రంలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్, కర్ణాటక ఎంపీ మునిస్వామి, నాయకులు కొండయ్య, తదితరులు

కమలోత్సాహం..

ప్రధాని మోదీ సభతో 'కమలం' శ్రేణుల్లో జోష్

- భారీగా తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు
- మోదీ గ్యారంటీ అంటే హామీలు పూర్తి చేసే గ్యారంటీ అని ఉద్ఘాటన
- మహబూబ్‌నగర్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఫిక్సింగ్ అయ్యాయని విమర్శలు
- మహిళ అని చూడకుండా అవమానకర భాష వాడుతున్న సీఎం అని ధ్వజం
- ఓటుతోనే సమాధానం చెప్పాలని ప్రజలకు పిలుపు
- బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని విజ్ఞప్తి

> **మహబూబ్‌నగర్ నుంచి** బీజేపీ ఎంపీ **అభ్యర్థిగా డీకే అరుణ** ఉన్నారు. ఈనెల 13న మీరు వేసే ప్రతి ఓటు నేరుగా మోదీకే వెళుతుంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాయి. ఈ సీటును గెలుచుకునేందుకు ఇక్కడ ఏ విధమైన ఆటలు నడుస్తున్నాయో నాకు తెలుసు. డీకే అరుణను మహిళ అని చూడకుండా ఇక్కడ సీఎం అవమానకరమైన భాష మాట్లాడుతున్నారు. వారికి మీరు ఓట్లతోనే సమాధానం చెప్పాలి. డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలి.
>
> - నారాయణపేట జన సభలో ప్రధాని నరేంద్రమోదీ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ప్రధాని నరేంద్ర మోదీ రాక భారతీయ జనతా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన జనసభకు జనాలు పోటెత్తడంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. సభలో ముందుగా మోదీ జోగుళాంబ మాతకు నమస్కరించి.. నా పాలమూరు సోదర, సోదరీమణులకు హృదయపూర్వక నమస్కారాలు అంటూ ప్రసంగం మొదలుపెట్టగా సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది. కాంగ్రెస్ అవలంబిస్తున్న దేశ అభివృద్ధికి వ్యతిరేకమైన ఎజెండాను అడ్డుకునేందుకు ఇక్కడ నిలబడ్డ ఏకైక పెట్టని కోట నరేంద్ర మోదీ అంటూ తనదైన పంథాలో ఆ పార్టీపై విమర్శలు గుప్పించారు. మోదీ గ్యారంటీ అంటే హామీలు పూర్తి చేసే గ్యారంటీ అని.. మోదీకి శక్తి మీ ప్రేమ, మీ ఓటు నుంచి వస్తుందంటూ ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. మోదీ ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

'ఈ ఎన్నికలు దేశ భవిష్యత్‌కు సంబంధించినవి. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దశాబ్దాలుగా తప్పుడు వాగ్దానాలు ఇస్తూ వచ్చాయి. ఇప్పుడు దేశం మోదీ గ్యారంటీని నమ్ముతోంది. మోదీ గ్యారంటీ అంటే అభివృద్ధికి గ్యారంటీ.. రాష్ట్ర, జాతీయ భద్రతకు గ్యారంటీ, ప్రపంచంలో భారత్ గౌరవం పెంపొందించే గ్యారంటీ, రానున్న ఐదేళ్లలో పేదలకు మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇచ్చే గ్యారంటీ.. 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచితంగా వైద్య చికిత్స అందించే గ్యారంటీ. మోదీ గ్యారంటీ అంటేనే పక్కాగా పూర్తి చేసే గ్యారంటీ.' అని అన్నారు.

స్వార్థం కోసం వాడుకున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్..

'మహబూబ్‌నగర్ ప్రాంత ప్రజలను బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు తమ స్వార్థమే కోసం వాడుకున్నారు. 2009లో కేసీఆర్‌ను పాలమూరు వాసులు ఎంపీగా గెలిపిస్తే.. తెలంగాణ వచ్చిన తర్వాత ఆయన ఇక్కడ ప్రజలను మరిచిపోయిండు. ఇప్పుడు నూతన సీఎం కూడా ఇక్కడి వారే. ఆయన కూడా ఢిల్లీలోని హైకమాండ్‌కు లెక్కాపత్రం చెప్పడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ ప్రాంతానికి కృష్ణా-తుంగభద్రల ఆశీర్వాదం ఉంది. అయినా ఇక్కడి వ్యవసాయ రైతులు దినసరి కూలి కోసం వేరే ప్రాంతాలకు వలస పోవాల్సి వస్తోంది. అని ఆవేదన వ్యక్తం చేశారు.

- మరిన్ని వివరాలు 2లో..



మక్తల్‌లో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సీఎం సభతో కాంగ్రెస్‌లో జోష్..

- పాలమూరు అభివృద్ధి బాధ్యత నాది
- బంగ్లాలోని చీకటి రాజకీయాలను సమాధి చేయాలి
- పాలమూరు గొంతుకగా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలి
- మక్తల్‌లో జనజాతర సభకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

> '15 ఏళ్ల కిందట మీరు జెడ్పీటీసీగా నాటిన మొక్క నేడు ముఖ్యమంత్రిగా మీ ముందుకు వచ్చాడు. జెడ్పీటీసీ నుంచి ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా గెలిపించి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేశారు. మీ బిడ్డను పడగొట్టేందుకు ఢిల్లీ నుంచి గొడ్డళ్లతో బయలుదేరారు. మీరు నాటిన వృక్షాన్ని నరికితే ఊరుకుంటారా?'
>
> - మక్తల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



మక్తల్‌లో జనజాతర బహిరంగసభకు హాజరైన జనం

- మరిన్ని వివరాలు 2లో..

సజావుగా పోలింగ్ నిర్వహణ

నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పోలింగ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద సిబ్బందికి అవసరమైన వసతులు కల్పించాలని, సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, పోలింగ్ బృందాలకు సామగ్రి అందజేసి కేంద్రాలకు ఆదివారం సాయంత్రం వరకే తరలించాలని చెప్పారు. సోమవారం ఉదయం మాక్ పోల్ నిర్వహించాలని, అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం, ప్రతి 2 గంటలకు ఓటింగ్ శాతం వివరాల నివేదిక సమర్పించాలని చెప్పారు.

రిసీవింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా విధులు

రిసీవింగ్ కేంద్రంలో అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. సోమవారం ఓటింగ్ ముగిసిన తర్వాత నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డులో పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, ఇతర మెటీరియల్ రిసీవింగ్ సెంటర్‌లో అత్యంత జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ముందస్తు ప్రణాళికతో చేసుకోవాలని ఏఆర్‌ఓలకు చెప్పారు.

దేశానికి ఏకైక సింహం.. మోదీ


మోదీకి జ్ఞాపిక ఇస్తున్న డీకే అరుణ, భరత్


సభకు హాజరైన జనం

- శత్రుదేశాలు భారత్ వైపు కన్నెత్తి చూడాలంటే వణకాలి
- మరోసారి మోదీ సర్కార్ రావడం ఖాయం
- రేవంత్‌రెడ్డికి ఓడిపోతామనే భయం పట్టుకుంది
- నారాయణపేట జనసభలో బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

నారాయణపేట: దేశం చుట్టూ ఉన్న చైనా, పాకిస్తాన్‌తోపాటు ఇతర శత్రు దేశాలు మన భారత్ వైపు కన్నెత్తి చూడకుండా చేసిన ఏకైక సింహం నరేంద్రమోదీ అని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నారాయణపేట జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. కర్ణాటకతో సరిహద్దు ఉన్న ఈ మారుమూల నారాయణపేటకు తొలిసారిగా వచ్చిన ప్రధాని నరేంద్రమోదీని చూడాలని.. మాటలు వినాలని వచ్చిన ప్రతి ఒక్కరికి నా హృదయ పూర్వక నమస్కారమని డీకే అరుణ అన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మన తెలంగాణలో సోమవారం జరగనున్న పోలింగ్‌లో బీజేపీ అభ్యర్థిగా కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు.

బీజేపీకే అత్యధిక స్థానాలు

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోనే కాదు.. రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందనే భయం సీఎం రేవంత్‌రెడ్డికి పట్టుకుందని డీకే అరుణ అన్నారు. తెలంగాణలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరూ ప్రధానిగా మోదీనే కోరుకుంటున్నారని అన్నారు. ఈసారి మా ఓటు నరేంద్రమోదీకే అంటూ ప్రజలు చెప్పడం ఆనందంగా ఉందన్నారు. దేశంలో నరేంద్రమోదీ ఉంటేనే పేదల బతుకులు బాగుపడుతాయని.. పేదింటి బిడ్డ ప్రధానమంత్రి ఉండబట్టే 60 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ చేయలేని అభివృద్ధి మోదీ చేసి చూపించారని కొనియాడారు. ప్రపంచ దేశాల్లోనే దేశాన్ని అగ్రగామిగా నిలిపారన్నారు. ప్రజలను మోసం చేసేందుకు మరోసారి సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరారని విమర్శించారు. దేశంలో కాంగ్రెస్ అడ్రస్ లేదని, రాహుల్‌గాంధీని ప్రధానిని చేస్తే ఆరు గ్యారంటీలు అమలవుతాయని సీఎం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్‌లో డీకే అరుణ గెలుస్తుందని రేవంత్‌రెడ్డి కొత్త వేషం వేసిండు.. అరుణమ్మ గెలిస్తే ముఖ్యమంత్రి పదవి పోతదని అంటుండని దుయ్యబట్టారు. అరుణమ్మ గెలిస్తే నరేంద్రమోదీ ఆశీస్సులతో పాలమూరు అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆడబిడ్డలనే గౌరవం లేకుండా మాట్లాడుతున్నరన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడ బిడ్డలను, మహిళలను ఈ విధంగా మాట్లాడితే ఊళ్లలో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు పడతాయా అని మహిళల వైపు చూసి అడగగా.. వారంతా పడవంటూ నినాదాలు చేశారు.

అభివృద్ధికి పెద్దపీట

రాష్ట్రాన్ని మోసం చేసే డోకే బాజ్ రేవంత్‌రెడ్డి.. ఆయనేమో (కేసీఆర్) రాష్ట్రాన్ని దోచుకుంటే.. ఈయన (సీఎం రేవంత్‌రెడ్డి) ఉన్నదంతా ఊడ్చుకుపోనీకే వచ్చాడని డీకే అరుణ ఆరోపించారు. ఓటుకు నోటు కేసులో జైలుకు పోయిన దొంగ రేవంత్‌రెడ్డి అన్నారు. అరుణమ్మపై, బీజేపీపై మాట్లాడే హక్కు రేవంత్‌రెడ్డికి లేదన్నారు. పాలమూరు యూనివర్సిటీకి రూ.150 కోట్లు ఇచ్చారని, రైల్వేలైన్ల ఆధునీకీకరణతోపాటు వికారాబాద్– కృష్ణా రైల్వే లైన్‌కు నిధులిచ్చారని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి రైతులు, యువకులు, ఎస్సీ, ఎస్టీలు అందరినీ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మోదీ కావాలన్నారు. సభలో బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ, కర్ణాటక ఎంపీ మునిస్వామి, రాష్ట్ర నేతలు నాగూరావు నామాజీ, రతంగపాండురెడ్డి, కొండయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పగడాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైడ్ లైట్స్

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ నారాయణపేటలో నిర్వహించిన జనసభ వేదికపైకి 3.29 గంటలకు చేరుకున్నారు.
- 3.41 గంటలకు జన సభనుద్దేశించి మోదీ ప్రసంగించారు.
- ప్రధాని తన ప్రసంగంలో మొదట నా పాలమూరు సోదర, సోదరీమణులకు, జోగులాంబదేవికి ప్రణామాలు అని చెప్పారు.
- పలువురు పెయింటింగ్ వేసిన నరేంద్రమోదీ చిత్రపటాలను ఎస్‌పీఎం పోలీసుల ద్వారా తీసుకున్నారు. మరో అమ్మాయి నరేంద్రమోదీ చిత్రపటంతో ఉన్న మాస్కును ధరించి వచ్చింది. గమనించిన మోదీ మీకు త్వరలోనే లేఖ రాస్తానని చెప్పడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.
- 37 నిమిషాల పాటు మోదీ ప్రసంగం కొనసాగింది.
- జనమంతా మోదీ.. మోదీ.. నినాదాలతో హోరెత్తించారు.
- భారత్ మాతాకు జై అంటూ తన ప్రసంగాన్ని 4.18 గంటలకు ముగించారు.
- వేదికపై ఉన్న నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌కుమార్‌ను భుజాన్ని తట్టి గెలుస్తున్నావు...ఢిల్లీకి వస్తున్నావంటూ మోదీ ఆశీర్వదించారు. వేదికపై ఉన్న ముఖ్య నాయకులను సైతం అందరినీ పలకరిస్తూ వేదిక పై నుంచి దిగారు. 4.30 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో మోదీ హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

సీఎం సభతో కాంగ్రెస్‌లో జోష్..

ఉమ్మడి జిల్లా అభివృద్ధి బాధ్యత నాది

- పాలమూరు గొంతుకగా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలి
- మక్తల్ జనజాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగింపునకు ఒకరోజు ముందు మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన కాంగ్రెస్ జన జాతర సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మక్తల్‌లో నిర్వహించిన జనజాతర బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'పదేళ్లుగా కేంద్రంలో మోదీ అధికారంలో ఉన్నారు.. ఐదేళ్లుగా పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా అడిగితే ఇవ్వలేదు. డీకే అరుణమ్మ మాత్రం జాతీయ ఉపాధ్యక్షురాలు పదవి తెచ్చుకుంది. మన కోసం ఏం తెచ్చింది.. ఏం ఇచ్చిందని ఆమెను గెలిపించాలి..? ఇక్కడి మాజీ ఎమ్మెల్యే ఇసుక దందాలు, అక్రమ కేసులు ఎక్కువయ్యాయని.. ఆ పిశాచాన్ని సీసాలో బంధించారు. అరుణమ్మను గెలిపిస్తే మళ్లీ ఊళ్లు, కృష్ణానది, వాగుల్లో పడి ఇసుక దోపిడీ చేస్తారు. వారి జెండాలే వేరు.. చీకట్లో అందరూ ఒకటే.. అరుణమ్మకు జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, మంత్రి పదవులు ఇచ్చింది కాంగ్రెస్. అలాంటి కాంగ్రెస్‌ను చంపుతా.. రేవంత్‌ను ఓడగొడతానని పాములా కాటేయాలని తిరుగుతోంది. పాలమూరులో పుట్టిన గంజాయి మొక్క అరుణమ్మను ఏరేయాలి.' అని వ్యాఖ్యానించారు.


అభివాదం చేస్తూ వేదిక పైకి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

మన ఓట్లు.. మనకే వేసుకుందాం

మాదిగలకు ఎస్సీ వర్గీకరణ.. ముదిరాజులకు బీసీ ఏ జాబితా.. వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నా.. మక్తల్– నారాయణపేట ఎత్తిపోతలు, మక్తల్ నియోజకవర్గంలో డిగ్రీ, ఇంటర్ కళాశాలలు, కోర్టు, 32 గ్రామాలకు సీసీ రోడ్లు కావాలంటే ఎంపీగా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని సీఎం కోరారు. ఇంట గెలిచి.. రచ్చ గెలవాలని అంటారు. రేవంత్‌రెడ్డి సొంత ఊళ్లో ఎంపీ సీటు గెలవాలి. ఇన్నేళ్లుగా ఎవరెవరికో ఓటేశాం. ఈసారి మన ఓట్లు మనకే వేసుకుందాం. నేను వేరు.. మీరు వేరు కాదు. నేనే మీరు.. నేను మీలో ఒకడిని.. మీ బిడ్డను. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్ర తెలంగాణ ముఖద్వారం మక్తల్‌లోకి అడుగు పెట్టినప్పుడు.. మీరు ఇచ్చిన ఘన స్వాగతం నా గుండెల్లో ఉంటుంది.

కాంగ్రెస్‌కు గౌరవం..

పార్లమెంట్‌లో రాష్ట్రం తరఫున, పాలమూరు గొంతుకగా ఉండాలంటే వంశీచంద్‌రెడ్డి ఎంపీగా గెలవాలి. పాలమూరును సస్యశ్యామలం చేసే బాధ్యత నాది. ఇందుకు చేదోడు వాదోడుగా ఉండేందుకు మనబిడ్డ ఢిల్లీలో ఉండాలి. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్న వంశీచంద్ రెడ్డికి ఎంపీ పదవి కావాలంటే ఒక్క సంతకంతో రాజ్యసభకు పంపించే శక్తి ఉన్నా.. ప్రజల తరఫున మీ బిడ్డగా ఎన్నికల్లో గెలిచి వెళ్తేనే మన కోసం కొట్లాడుతాడు. మీవాడిగా పనిచేస్తాడు. యుక్త వయస్సు నుంచే పార్టీ కోసం కష్టపడ్డ వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపిస్తే కాంగ్రెస్ గౌరవం పెరుగుతుంది.

మీ సేవకుడిగా మాట ఇస్తున్నా..

మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ 'మీ బిడ్డగా.. మీ సేవకుడిగా మాట ఇస్తున్నా. పాలమూరు అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తా. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్టు కల సాకారమైంది.. సంగంబండ సమస్యలకు పరిష్కారం దొరికింది. పాలమూరు భవిష్యత్ తరాల కోసం జరుగుతున్న ఈ ఎన్నికల్లో పాలమూరు బిడ్డల పౌరుషాన్ని చూపి ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలి. పాలమూరు అభివృద్ధికి కసితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బలాన్ని ఢిల్లీలో పెంచాలని పిలుపునిచ్చారు. సభలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సైడ్‌లైట్స్

- సీఎం రేవంత్‌రెడ్డి 4.08 గంటలకు మక్తల్‌లో నిర్వహించిన జనజాతర సభకు వచ్చారు.
- హెలీప్యాడ్ నుంచి బహిరంగ సభావేదిక వద్దకు 4.10 గంటలకు చేరుకున్నారు.
- 4.30 గంటలకు రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించారు.
- మక్తల్ నియోజకవర్గం నుంచి లక్ష ఓట్ల మెజార్టీ ఇస్తామని కార్యకర్తలతో చెప్పించారు.
- 5 గంటలకు ప్రసంగం ముగియగా.. తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు.
- ఎల్లమ్మకుంటలో ట్రాఫిక్ జాం.. గంటల తరబడి ప్రజలు ఇబ్బంది పడ్డారు.
- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి అభివాదం చేశారు.

– మక్తల్

నేడు అన్నామలై రాక

పాలమూరు: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి శనివారం తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై రానున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా ఆమెతో కలిసి ఉదయం 9 గంటల వరకు పట్టణంలోని పద్మావతికాలనీ నుంచి క్లాక్‌టవర్ వరకు నిర్వహించే బైక్ ర్యాలీలో పాల్గొంటారని పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

నగదు పట్టివేత



బాలానగర్: పట్టణంలోని పోలీస్ చెక్ పోస్టు వద్ద శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.53 వేలు పట్టుబడినట్లు ఎస్ఐ తిరుప్పాజీ తెలిపారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూర్ మండలం గోనెగండ్లకు చెందిన రాములు హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వాహనంలో వెళ్తుండగా నగదు పట్టుబడిందని.. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పాలమూరు రూపురేఖలు మారబోతున్నాయ్

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/ధన్వాడ: ఒకప్పుడు వలసలు, ఆకలి జిల్లాగా పేరొందిన పాలమూరు రూపురేఖలు మారబోతున్నాయని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో పార్లమెంట్ నియోజకవర్గ గౌడ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. 65 ఏళ్ల తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం మన అదృష్టమని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానాల నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న చల్లా వంశీచంద్‌రెడ్డి, మల్లు రవిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గౌడ సామాజిక వర్గానికి ఏ సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని తప్పక పరిష్కరిస్తామన్నారు. అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. మాయమాటలు చెప్పి రాముడిని బజారున పెట్టి రాజకీయాలు చేయడం బీజేపీ నేతలకు తగదన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ తమ పబ్బం గడుపుతున్నారన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను పదేళ్లలో అప్పుల పాలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమైనవని, సీఎం రేవంత్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తమ హయాంలో గౌడ సామాజిక వర్గానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.


మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

అక్షింతలు కాదు.. అభివృద్ధి చూపి ఓట్లడగండి

బీజేపీ వారు అక్షింతలు చేతులో పెట్టి ఓట్లు అడుగుతున్నారని, ప్రజలకు కావాల్సింది అభివృద్ధి అని, మీరు చేసిన అభివృద్ధి చూపిన తర్వాత ఓట్లు అడగాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జుపల్లి కృష్ణరావు అన్నారు. ధన్వాడ మండలంలోని మందిపల్లి, గోటూర్, కొండ్రోన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా, నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల ద్వారా నారాయణపేట నియోజకవర్గంకు సాగు నీరందిస్తామని తెలిపారు. అనంతరం డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మందిపల్లికి కమ్యూనిటీహాల్, నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో వెంకట్రామారెడ్డి, బాలయ్య, తిరుపతయ్య, షేకమాద్, అహ్మద్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నమ్మించి అన్యాయం చేసింది

- బీఆర్‌ఎస్‌కే నా మద్దతు
- మాజీ ఎంపీ మందా జగన్నాథం

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి నమ్మించి తనను పార్టీలోకి ఆహ్వానించి ఎంపీ టికెట్ ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిందని మాజీ ఎంపీ మందా జగన్నాథం అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి మండలంలోని కొండేరులోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి పరిపాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న మూడు పార్లమెంట్ స్థానాల్లో ఒక్కటి కూడా మాదిగ సామాజిక వర్గానికి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ మాటలు కోటలు దాటుతున్నాయి గానీ.. చేతలు గడప కూడా దాటడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన హుందాతనాన్ని వదిలి అసభ్య పదజాలంతో మాట్లాడటం చేప్పేందుకు సిగ్గుగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్‌ఎస్‌కు తన పూర్తి మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పరిపాలన వ్యవహారాల్లో ఎంతో అనుభవం, విద్యావంతుడు, ఐపీఎస్ అధికారిగా ఎన్నో ఉన్నతమైన పదవులను అనుభవించి ప్రజలకు ఉత్తమమైన సేవలందించిన వ్యక్తి మన అలంపూర్‌కు చెందిన ఆర్‌ఎస్‌పీ అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో బీఆర్‌ఎస్ బలపర్చిన ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ప్రజలు గుర్తించి ఈనెల 13న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏకాంత్, బొట్టు వీరన్న, అయ్యన్న, యోహాన్, బీచుపల్లి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపీ మందా జగన్నాథం

రేవంత్ మాటలు నమ్మి మోసపోవద్దు

- ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


శాంతినగర్‌లో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

శాంతినగర్/అయిజ/తెలకపల్లి: గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎన్నో అమలుకు నోచుకోని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు ఎవరూ నమ్మవద్దని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు గృహంలో ఎమ్మెల్యే విజయుడు అధ్యక్షతన ఏర్పాటుచేసిన వడ్డేపల్లి, రాజోళి ఉమ్మడి మండలాల బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏనాడూ నడిగడ్డలో నడవనోడు, పాలమూరు బిడ్డల బాధలు పట్టించుకోనోడు తుంగభద్ర వరదలొస్తే తిరిగిచూడనోడు ఈరోజు వచ్చి కాంగ్రెస్ పార్టీకి ఓట్లేయమని అడుగుతున్నాడన్నారు. ఆరు గ్యారంటీలని చెప్పి ఓట్లు వేయించుకున్నాడు. అప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఇప్పుడు మరో నాటకం మొదలుపెట్టి భవిష్యతలో ఏదో చేస్తానని ఓట్లు దండుకోవాలని చూస్తున్నాడన్నారు. ఖమ్మంలో పుట్టినోళ్లకు నాగర్‌కర్నూల్‌లో ఏమి పనంటూ కాంగ్రెస్ అభ్యర్థి గురించి విమర్శించారు. మల్లు రవి ఇంటి విలువ వంద కోట్లు ఉంటుందని, పేదలకు మాత్రం ఇళ్లు కట్టివ్వాలని ధ్యాసలేదన్నారు. కుమారుడికి తొమ్మిది కంపెనీలు ఉన్నాయని, మరి మన బిడ్డలకు ఎందుకు ఉండొద్దన్నారు. రామమందిరం చూపెట్టి రాజ్యాంగం రద్దు చేయాలని బీజేపీ చూస్తుందన్నారు. మతం పేరు చెప్పి ఓట్లు అడిగేవారిని నమ్మవద్దన్నారు. బీజేపీ గెలిస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీల బతుకులు రోడ్లమీద పడతాయన్నారు. గతంలో రాములును ఎంపీగా గెలిపిస్తే ఐదేళ్ల కాలంలో కేవలం ఆరు నిమిషాలు మాత్రమే లోక్‌సభలో ప్రసంగించారని గుర్తుచేశారు. అనంతరం అయిజ పట్టణంలో బీఆర్‌ఎస్ రోడ్‌షో నిర్వహించారు. ఐపీఎస్ ఉద్యోగాన్ని వదులుకుని, ఈ ప్రాంతానికి సేవ చేసేందుకు వచ్చానన్నారు. అలంపూర్‌లో పుట్టి నల్లమలలో పెరిగిన మీ బిడ్డను నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీగా గెలిపించి ఆదరించాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో కలసి తెలకపల్లి మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం నుంచి చౌరస్తా వరకు నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు.

నేడు వనపర్తికి కేంద్ర మంత్రి అమిత్‌షా

వనపర్తి: పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చివరి రోజైన శనివారం వనపర్తిలో బీజేపీ నిర్వహించే బహిరంగసభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. తొలిసారిగా జిల్లాకు కేంద్ర హోంశాఖ మంత్రి వస్తుండటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనం వెనుక భాగంలో హెలీప్యాడ్ ఉండటంతో అక్కడికే హెలీకాప్టర్‌లో చేరుకొని అక్కడి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకొని ప్రసంగించనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

శుక్రవారం కేంద్ర సమాచారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ సభ ఏర్పాట్లను జిల్లా నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. 400కుపైగా బీజేపీ గెలుపొందే స్థానాల్లో నాగర్‌కర్నూల్ కూడా ఒకటని, భరత్ ప్రసాద్ గెలుపు ఖరారైందని చెప్పారు. బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. వీడియో మార్ఫింగ్‌లో అడ్డంగా దొరికిపోయి రాష్ట్ర ప్రజల గౌరవాన్ని తగ్గించారని, అధికారం కోసం కాంగ్రెస్ ఆడుతున్న నాటకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. భరత్‌ప్రసాద్ గెలుపుతో ఈ ప్రాంతవాసుల దశాబ్దాల కల రైల్వే లైన్, మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాట్లు సాకారమవుతుందని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం సభ విజయవంతం చేసేందుకు ఓ ప్రైవేట్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన పార్టీ మండల అధ్యక్షుల సమావేశంలో పాల్గొని దిశా నిర్దేశం చేశారు. హరిప్రసాద్, రామన్‌గౌడ్, జ్యోతి, రమణ, కుమారస్వామి, రాము పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

70 ఏళ్లలో చేయని అభివృద్ధి పదేళ్లలో చేశాం


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ: 70ఏళ్లలో కాని అభివృద్ధి కేవలం పదేళ్లలో చేసి తెలంగాణను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దామని మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఆయన మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి మండల కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. పదేళ్లలో సాగు, తాగునీరు, కోతల్లేని కరెంట్, రోడ్లు, శ్మశానవాటికలు, రైతుబంధు, రైతుబీమా వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కాని హామీలిచ్చి ప్రజలకు మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్.. నేడు మళ్లీ గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు వస్తుందని, అప్రమత్తమై తిరస్కరించాలని సూచించారు. ఆరు గ్యారంటీల్లో కేవలం ఒక్క ఉచిత బస్సు మినహా మరేదీ అమలు కాలేదని, రుణమాఫీ అని రైతులను ముంచారన్నారు. తాము అధికారంలో ఉండగా రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతబీమా ఇచ్చి రైతులను రాజుల్లా చూసుకున్నామని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. వరిని పండించిన రైతులు ప్రస్తుతం కరువు కారణంగా సగం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో గగ్గోలు పెడుతున్నారని, పెట్టుబడి కూడా లేక నష్టాల్లోకి నెట్టిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మొద్దని కోరారు. అదేవిధంగా బీజేపీ కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రానికి చేసిందేమీ లేదని, తాను వందల కొద్ది ప్రశ్నలు పార్లమెంట్‌లో సంధించినా ఫలితం లేకపోయిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మాజీ హోంమంత్రి, మాజీ మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లోక్‌సభ ఎన్నికలను ఈనెల 13న స్వేచ్ఛగా, ప్రశాంతంగా నియమ, నిబంధనల ప్రకారం నిర్వహించాలని కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఎన్నికల వ్యయ పరిశీలకులు వరుణ్‌రంగస్వామి, రిటర్నింగ్ అధికారి జి.రవినాయక్‌లతో కలిసి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ అధికారులతో వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా నిర్వర్తించాలన్నారు. పోలింగ్‌కు కేవలం రెండు రోజుల సమయమే ఉన్నందున మద్యం, డబ్బు, ఉచిత కానుకల పంపిణీపై ఫిర్యాదులు వచ్చే అవకాశం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో ఎంసీసీ, ఎస్ఎస్‌టీఎఫ్ఎస్‌టీ బృందాలు, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని, వైద్య శిబిరాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి పంపిణీ రోజున స్ట్రాంగ్‌రూంకు చేరే వరకు పోలింగ్ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌ను ముందుగా డెమో నిర్వహించి చెక్ చేసుకోవాలన్నారు.


వెబెక్స్‌లో పాల్గొన్న కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు భూటియా, రిటర్నింగ్ అధికారి రవినాయక్ తదితరులు

లాడ్జీలు, కల్యాణ మండపాల తనిఖీ

అనంతరం మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్ మాట్లాడుతూ శనివారం సాయంత్రం ఆరు గంటలకు ప్రచారం ముగుస్తుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నియోజకవర్గంలో స్థానికేతరులు, బయటి వ్యక్తులు ఉండొద్దని, లాడ్జీలు, కల్యాణ మండపాలను సైతం తనిఖీ చేస్తామన్నారు. ఇప్పటికే మూడు కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు చేరుకున్నాయన్నారు. ప్రతి మండలంలో స్ట్రైకింగ్ ఫోర్స్‌తో పాటు రూట్ మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.